ఊరూరా స్వచ్ఛదనం- పచ్చదనం


లంగ్డాపూర్‌లో మొక్కలు నాటుతున్న ఆర్డీవో రాజేశ్వర్


నందిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు


రెంజల్‌లో..

పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఉత్సాహంగా ప్రారంభమైంది. తొలి రోజు స్థానిక నేతలు, మహిళ, యువజన సంఘాల సభ్యులు, వార్డు కమిటీల సభ్యులతో కలిసి అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాలల్లో, గ్రామ పంచాయతీలలో ప్రతిజ్ఞలు చేయించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఈ నెల 9 వరకు గ్రామాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పరిశుభ్రత, ప్రచ్ఛదనంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ దోమల నివారణ, అంటు వ్యాధులు అరికట్టే చర్యలు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. పలు చోట్ల మొక్కలు నాటారు. అలాగే పలు చోట్ల స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్


చందూర్ మండలం లక్ష్మాపూర్‌లో ..


ఆర్మూర్ పట్టణంలోని రెండో వార్డులో..


ముప్కాల్ మండల కేంద్రంలో..


రాణాకలాన్‌లో ..


రామన్నపేట్‌లో..


పోతంగల్‌లో..


చేంగల్ గ్రామంలో..


మంథనిలో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఆర్డీవో రాజా గౌడ్


డొంకేశ్వర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు


కమ్మర్‌పల్లిలో


వేల్పూర్ హైస్కూలులో మొక్కలు నాటుతున్న అధికారులు


భీమ్‌గల్‌లో ..


బాల్కొండలో గ్రామసభను నిర్వహిస్తున్న అధికారులు


కమ్మర్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో వ్యాసరచన పోటీలు



బోధన్ పట్టణంలో..

క్లుప్తంగా

పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా బోడ దేవానందం

వేల్పూర్: వేల్పూర్ మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా బోడ దేవానందం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సీవీ నర్సింహారావు, అసోసియేట్ అధ్యక్షులుగా రాజేందర్‌గౌడ్, మహిళా ఉపాధ్యాయురాలు శైలజ, మహిళా కార్యదర్శిగా అంజలి, కార్యదర్శిగా రాకేశ్‌ను ఎన్నుకున్నారు. జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్ వారికి నియామకపత్రాలు అందజేశారు. ఎన్నికల పరిశీలకులుగా కృష్ణారెడ్డి, గంట అశోక్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈవో వనజ, వేల్పూర్ హైస్కూల్ హెచ్‌ఎం రాజన్న, పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని క్రాంతి హైస్కూల్ ఆవరణలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. పాస్ట్ గవర్నర్ ఎస్‌వి హన్మంత్‌రెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ మొయినాబాద్ సంయుక్త సహాయంతో ముగ్గురికి తోపుడు బండ్లు పంపిణీ చేశారు. రోటరీ అధ్యక్షుడు రజనీష్ కిరాడ్, కాంతి గంగారెడ్డి, చరణ్ రెడ్డి పాల్గొన్నారు.

గల్లీలో గుంతలను పూడ్చండి

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో పలు గల్లీలలో రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారి పోయాయని, వెంటనే గుంతలను పూడ్చాలని సోమవారం జీపీ కార్యదర్శి రజనీ కాంత్‌రెడ్డికి స్థానిక మహిళలు వినతి పత్రం అందజేశారు. గుంతల్లో వర్షపు నీరు నిలువడంతో నీటిలో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గుంతలను పూడ్చాలని కోరారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టు

ఆర్మూర్‌టౌన్: సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారులు లోకల్ కోర్టు మంగళవారం ఉంటుందని పెర్కిట్ ఏడీఈ రాజేశ్వర్ అన్నారు. పెర్కిట్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉదయం పదిన్నర గంటల నుంచి ఒంటి గంట వరకు లోకల్ కోర్టును నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెర్కిట్, బాల్కొండ, ముప్కాల్, మెండోర మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను ప్రస్తావించి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైద్య శిబిరం

మాక్లూర్: మండలంలోని గుత్ప ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం గుత్ప గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. 70 మంది వృద్ధులకు అన్నిరకాల వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 60 ఏళ్లు పైబడినవారికే ఈ వైద్య శిబిరంలో చికిత్స అందించినట్లు వైద్యులు తెలిపారు. గ్రామాల్లో అనేక మంది వృద్ధులు మోకాళ్ల నొప్పులు, తిమ్మిర్లు వంటి జబ్బులతో బాధపడుతున్నారని, ఈ విషయం తెలిసి గ్రామాల వారీగా వైద్యశిబిరాలు నిర్వహించటానికి ముందుకొచ్చినట్టువారు తెలిపారు. వైద్యులు ప్రేమలత, వరలక్ష్మి, డీపీఎం వందన, ఫార్మాసిస్టులు తదితరులు పాల్గొన్నారు.

ఈత వనాలను సంరక్షించాలి

నవీపేట: గ్రామాలలోని ఈత వనాలను సంరక్షించాలని ఎక్సైజ్ సీఐ దిలీప్ సూచించారు. మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల-రేణుక ఎల్లమ్మ పరిసర ప్రాంతాలలో సోమవారం ఈత వనాలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈత వనాలను నాటి ప్రకృతిని కాపాడాలని సూచించారు. గీతా కార్మికులు పాల్గొన్నారు.

పోచారంలో కుక్కల బెడద

ఎడపల్లి(బోధన్) : పోచారం గ్రామంలో సోమవారం వీధి కుక్కలు 60 ఏళ్ల వయసున్న వెంకన్నను కరవడంతో ఆయన వేలుకు తీవ్ర గాయమైంది. అదేవిధంగా గ్రామంలో రెండు మేకలను కూడా తీవ్రంగా గాయపరిచి చంపేశాయి. గతంలో ఇలానే పలుమార్లు గ్రామంలో వీధి కుక్కలు గ్రామస్తులపై దాడి చేశాయని, సంబంధిత శాఖాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పోచారం గ్రామ విలేజ్ కమిటీ అధ్యక్షుడు అశోక్ కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్‌టౌన్: సిద్ధుల గుట్టపై నిర్మిస్తున్న నవగ్రహాల ఆలయానికి, భక్తుల సౌకర్యార్థం రెండు గదుల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్ రెడ్డి, సీనియర్ నేత మానాల మోహన్ రెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పల్లకీసేవలో సైతం పాల్గొన్నారు. నవగ్రహ ఆలయ నిర్మాణానికి మోర్తాడ్‌కు చెందిన జయచందర్ రెడ్డి రూ.2 లక్షలు అందజేశారు.

ఆర్టీసీ డిపో ఆవిర్భావ వేడుకలు

బోధన్: ఆర్టీసీ డిపో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం పట్టణ కేంద్రంలోని డిపో ప్రాంగణంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. 1985 ఆగస్టు 5న డిపో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ నాటి నుంచి ప్రయాణికులకు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతూ మెరుగైన సేవలందించి ప్రత్యేక గుర్తింపు సాధించిందని పేర్కొన్నారు. డిపో ఇన్‌చార్జి డీఎం సరిత, సీఐ జానాబాయి, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


కాలనీవాసులకు మొక్కలను అందజేస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

ఆర్మూర్‌టౌన్/మాక్లూర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 10, 23వ వార్డులతో పాటు మండలంలోని అంకాపూర్ గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే మాక్లూర్ మండలంలోని అమ్రాద్, కల్లెడి గ్రామాల్లో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. వార్డులలో ఇంటింటికి మొక్కలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో అపరిశుభ్రతకు తావు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా పారిశుధ్యంలోపిస్తే స్థానిక పంచాయతీ కార్యదర్శితో పాటు అధికారులదే బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


నందిపేట తహసీల్ ముందు ఆందోళన చేస్తున్న ప్రజాపంథా నేతలు, మహిళలు

నందిపేట్ (ఆర్మూర్): ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు నందిపేట తహసీల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసీల్దార్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపిస్తామని ప్రజలు హామీ ఇచ్చినప్పటికీ 8 మాసాలు గడుస్తున్నా ఇంతవరకు అమలు జరగకపోవడం విచారకరమన్నారు. అర్హులైన అందరికీ తెల్లరేషన్ కార్డులు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తేవాలని కోరారు. వంట గ్యాస్ సబ్సిడీ అందించాలన్నారు. పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు కూశన్న, మల్లయ్య, దేవయ్య, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి తహసీల్ వద్ద..

కమ్మర్‌పల్లి: ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాపంథా మాస్‌లైన్ ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి తహసీల్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో పింఛన్‌లను రెట్టింపు చేయడంతో పాటు, ఇళ్ల స్థలాలున్న వారికి రూ.5 లక్షలు, ఇళ్లు లేని వారికి ఇళ్లు నిర్మిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. ఈమేరకు వినతి పత్రం అందజేశారు. సారా సురేష్, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టారు. స్థానిక మహాలక్ష్మి మందిరం కల్యాణ మండం నుంచి ర్యాలీ ప్రారంభించారు. ధర్నా అనంతరం ఆర్డీవో ఆఫీస్ అధికారికి వినతి పత్రం అందించారు.

తహసీల్ ఆఫీస్ ఎదుట బాధితుల ఆందోళన


రుద్రూర్ తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న సాయవ్వ కుమార్తెలు

రుద్రూర్: తమకు చెందాల్సిన భూమిని తమ సోదరుడి పేరుతో పట్టా చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ సోమవారం బాధిత మహిళలు రుద్రూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. వివరాలు.. రాయకూర్ గ్రామానికి చెందిన కుర్మ సాయవ్వకు ఒక కుమారుడు, ముగ్గురు కూమార్తెలు. సాయవ్వ చనిపోయినపుడు అర ఎకరం భూమిని ముగ్గురు కుమార్తెలకు ఇవ్వాలని గ్రామ పెద్దల సమక్షంలో ఒప్పందం జరిగింది. ఐతే సాయవ్వ కుమారుడు అబ్బయ్య ఒప్పందాన్ని బేఖాతర్ చేస్తూ ఆ భూమిని తన పేరుపై పట్టా మార్పిడి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న సాయవ్వ కుమార్తెలు గ్రామస్తులతో కల్సి తహసీల్ కార్యాలయానికి వచ్చి ఆందోళన చేశారు. తమ సోదరుడి పేరుతో పట్టా ఎలా చేశారని తహసీల్దార్‌తో వాగ్వివాదానికి దిగారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దార్ వెంకటేశం మాట్లాడుతూ.. అబ్బయ్య పేరుపై ఉన్న పట్టాను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని, తప్పుదోవ పట్టించి పట్టా చేసుకున్నందుకు కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ప్రమాద ఘటనపై కేసు నమోదు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణం రాకాసీపేట్ బస్టాండ్ వద్ద జరిగిన ఘటనపై బాధితురాలి భర్త గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు.. నారాయణఖేడ్ గ్రామానికి చెందిన బోలీబాయి లయన్స్ కంటి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఆదివారం బాన్సువాడ బస్టాండ్ నుంచి బోధన్ ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు టీఎస్16 యూబీ4343లో బోధన్‌కు వచ్చింది. రాకాసీపేట్ బస్టాండ్ వద్ద బస్సు దిగుతుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో బస్సు వెనక టైర్లు ఆమె కాళ్లపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి .. ఆ తర్వాత ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్యవైశ్యసంఘం నూతన కార్యవర్గం

వేల్పూర్: మండల కేంద్రంలో సోమవారం ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లాభిశెట్టి భానుచందర్, ప్రధాన కార్యదర్శిగా చిటిమల రాజ్‌కుమార్, కోశాధికారిగా పుత్తూరు గంగాధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నూతన గౌడ సంఘం ఎన్నిక

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల కేంద్రంలో సోమవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతన సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నటరాజ్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా దయానంద్‌గౌడ్, కోశాధికారిగా బాలాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నవీన్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా ఎల్లాగౌడ్, తదితరులు ఎన్నికయ్యారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



రుద్రూర్: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని సర్వ శిక్షా అభియాన్ ఏఎంవో జీవన్ సూచించారు. కోటగిరి మండలం కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. మరోసారి చిన్న తప్పిదం జరిగినా ఏజెన్సీని తొలగిస్తామని హెచ్చరించారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఎన్. శ్రీనివాస్ రావ్, హెచ్‌ఎం డి.శ్రీను, ఉపాధ్యాయులు ఉన్నారు.

బీడీ కార్మికులకు రూ.4 వేల భృతి చెల్లించాలి



నవీపేట: బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు రూ.4 వేల జీవన భృతి చెల్లించాలని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరేందర్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 2 వేల మంది బీడీ కార్మికులతో నవీపేటలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడారు.

నిజాంషుగర్స్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలి



బోధన్: మూతబడిన నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని, వెంటనే నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. సోమవారం బోధన్ ఎన్డీఎస్ఎల్‌ను పార్టీ జిల్లా నాయకులతో కలసి సందర్శించి మాట్లాడారు. కాలయాపన చేయకుండా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని తెరిపించి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్, తదితరులున్నారు.

జాతీయ రహదారి పక్కన వాహనాలు నిలపొద్దు



బాల్కొండ: జాతీయ రహదారి-44 పక్కన వాహనాలను నిలపొద్దని బాల్కొండ ఎస్సై యాసర్ అరాఫత్ అన్నారు. సోమవారం హైవే అధికారులతో కలిసి జాతీయ రహదారి అప్రోచ్ రోడ్లను, రహదారి పక్కన ఉన్న దాబాలను పరిశీలించారు. ఈసందర్భంగా వారితో మాట్లాడారు.. రోడ్డు పక్కన వాహనాలను నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారి పక్కన హోర్డింగ్‌లు కూడా ఏర్పాటు చేయవద్దన్నారు. హైవే అధికారులు రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	రాయన్ (తెలుగు) - 12.15, 7.10 కల్కి 2898 ఏడీ (తెలుగు) - 3.25, 10.20
స్క్రీన్-2 -	డెడ్‌పూల్ 3డీ (తెలుగు)- 10.00, 4.00, 10.00, బడ్డీ (తెలుగు) 1.00, 7.00
స్క్రీన్-3 -	యావరేజ్ స్టూడెంట్ నాని (తెలుగు) - 1.45, -తిరగబడర సామీ (తెలుగు) 7.20,- రాయన్ (తెలుగు) 10.30
స్క్రీన్-4 -	శివం భజే (తెలుగు) - 11.00, 1.45 7.35, 10.20, ఉషా పరిణయం (తెలుగు) 4.30

సంపద వనాలను పట్టించుకున్నారు..!



సాక్షి స్పందన

బాల్కొండ: బాల్కొండ మండలం బస్సాపూర్, మెండోరా మండలం పోచంపాడ్‌లోని సంపద వనాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో 'సంపద వనాలపై పట్టింపేది' అనే శీర్షికన సోమవారం సాక్షి దిన పత్రిక వార్తా కథనం ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు సంపద వనాలో ఉపాధి హామీ కూలీలతో పిచ్చి మొక్కలను తొలిగింపచేశారు. సంపద వనాలను సంరక్షిస్తామని ఈ సందర్భంగా ఏపీవో ఇందిరా తెలిపారు.

సంక్షిప్తం

స.హ. చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

ఆర్మూర్: ప్రభుత్వ పాలనలో పారదర్శకతను తెలుసుకోవడానికి ప్రతీ ఒక్కరు విద్యార్థి దశ నుంచే సమాచార హక్కు(స.హ.) చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స.హ. చట్టం పరిరక్షణ కమిటీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఆదే ప్రవీణ్ కుమార్ సూచించారు. ఆర్మూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో స.హ. చట్టంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. న్యాయవాది గటడి ఆనంద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులందరికి బ్యాంకు రుణాలు ఇవ్వాలి

రుద్రూర్: రైతు రుణమాఫీ పథకంలో మాఫీ పొందిన రైతులందరికి బ్యాంకులు తిరిగి రుణాలివ్వాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాధరప్పా, పల్లపు వెంకటేష్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ జరిగిన రైతులకు కొన్ని బ్యాంకులు పలు నిబంధనలు పెట్టడం వల్ల తిరిగి రుణం పొందలేకపోతున్నారని, దీంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు లక్ష్మణ్, బాబు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బుద్దె రాజేశ్వర్ విగ్రహ ఏర్పాటుకు సన్నాహక సమావేశం

బోధన్: సాలూర గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, బోధన్ తాజా మాజీ ఎంపీపీ బుద్దె సావిత్రి భర్త దివంగత రాజేశ్వర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు పార్టీలకతీతంగా గ్రామ పెద్దలు, నాయకులు ఆయన అభిమానులు సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. గ్రామ శివారులోని బైపాస్ రోడ్డుకు ఆనుకొని, ఖాజాపూర్ వెళ్లే కూడలిలో విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 19న విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ చేయనున్నట్లు గ్రామపెద్దలు వెల్లడించారు.